విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, మే 2023

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌతమిశాలి

విశాలాంధ్ర-అనంతపురం: అనంతరం జెఎన్టీయులోని స్ట్రాంగురూంల భద్రతను పరిశీలించి బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ..కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపడతామని జిల్లా నూతన ఎస్పీ గౌతమిశాలి పేర్కొన్నారు. జిల్లా నూతన ఎస్పీగా ఆమె ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛేంబర్లో పదవీ బాధ్యతల స్వీకరించారు. అనంతరం ఎస్పీ కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రశాంతత లోపించకుండా శాంతిభద్రతలను పరిరక్షించడానికి కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. అన్నివర్గాల ప్రజల సహకారం తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మాట్లాడి మెరుగైన పోలీసింగ్ కు కృషి చేస్తామన్నారు. సెన్సిటివ్ గ్రామాలు, బౌండోవర్లు. ఇలా ఏదైనా చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు స్ట్రాంగు రూంల వద్ద పటిష్ట మూడంచెల భద్రత కొనసాగుతోందని.. కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా కూడా ఎలాంటి హింస, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మూడంచెల భద్రతను మరింత బలోపేతం చేయండి. స్థానిక జెఎన్టీయు స్ట్రాంగు రూంల భద్రతను ఎస్పీ గౌతమిశాలి ఐపిఎస్ పరిశీలించారు. కేరళ సాయుధ స్పెషల్ పోలీసులు, ఏ.ఆర్ సాయుధ పోలీసులు మరియు సివిల్ పోలీసులు మూడంచెల భద్రత నిర్వహిస్తుండటాన్ని సమీక్షించి మరింత బలోపేతం చేయాలన్నారు. పార్కింగ్ స్థలాన్ని స్ట్రాంగు రూంలకు దూరంగా ఏర్పాటు చేయాలని, అన్ని గేట్లలోను సిబ్బందిని బందోబస్తుకు నియమించాలని సూచించారు. కౌంటింగు రోజున తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలకు, హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి (ఏ.ఆర్), అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, సి.ఐ లు జాకీర్ హుస్సేన్, ఇందిర, రెడ్డెప్ప, ప్రతాప్ రెడ్డి, తదితరులు వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: భారతదేశంలో చరిత్రకలిగిన కాంగ్రెస్ పార్టీపైన ఆ పార్టీలోనే కొనసాగుతున్న కొంతమంది వ్యక్తులు పార్టీ పట్ల అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేస్తున్నారని అలాంటి వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి రేగటి చెన్నప్ప, జిల్లా కార్యదర్శి ఇంద్రావతి ఓబులేసు, వజ్రకరూరు మండల కన్వీనర్ పంది కుంట శ్రీకాంత్ వర్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పదవులను అనుభవిస్తున్న కొందరు నాయకులు అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉన్న కొందరిపై అర్థరహితమైన నిరాధార మైన ఆరోపణలు చేస్తూ విమర్శలు చేయటం తగదని పేర్కొన్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు కనీసం ఏజెంట్లను నియమించుకోలేదని పైరవీలు చేసి టికెట్లు పొందినట్లు విమర్శలు చేయటం సరికాదని వారు పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తుల పట్ల పార్టీ అధిష్టానం అప్రమత్తంగా ఉండాలని వెంటనే అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో ఎవరు ఇలాంటి ఆరోపణలు చేయకుండా ఉండాలంటే పార్టీఅధిష్టానం చర్యలు తీసుకోవాలని వారు ఈసందర్భంగా అధిష్టానాన్ని కోరారు.

టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-రాయదుర్గం: రాయదుర్గం పట్టణంలోని దశపూజ మహా గణపతి దేవాలయంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు అఖండ మెజార్టీ సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అత్యధిక మెజార్టీ సీట్లను కైవసం చేసుకొని ముఖ్యమంత్రి కావాలని, రాయదుర్గం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాల్వ శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా మరియు మంత్రి కావాలని శ్రీదశబుజ మహాగణపతికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్తి, పైతోట శీన, ఖైదీ వెంకటేశులు, ప్రహల్లాద, తమ్మయ్య, బంజి ఓబయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంకు విరాళం అందజేత

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండల పరిధిలోని తిమ్మలాపురంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవస్థానం నిర్మాణం కొరకు డి.హిరెహాల్ మండల వైసీపీ కన్వీనర్ ఎం.వన్నురస్వామి తన వంతు ప్రయత్నంగా రూ. 20 వేలు గ్రామ పెద్దలకు విరాళంగా అందజేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో కాకుండా రాయదుర్గం నియోజకవర్గంలో దేవస్థానాలకు, కుల సంఘాల విగ్రహాలకు, దేవాలయాల కొరకు నిత్యం ప్రజా సేవలో భాగస్వామ్య అవుతూ ప్రజల మన్నపాలు అందుకుంటున్న మండల వైసీపీ కన్వీనర్ ఎం. వన్నురస్వామిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు హనుమంతరెడ్డి, జిల్లా వైసీపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బసవరాజు, బొజ్జప్ప, నాగిరెడ్డి, జయరామ్‌రెడ్డి, రవిగౌడ, రామాంజినేయులు, అంజినేయులు, రాజేష్, తిమ్మరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రాయదుర్గం అర్బన్: రాయదుర్గం పట్టణంలోని కోటాలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం జంగమ లింగత్ సంగమ ఆధ్వర్యంలో బసవజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికీ ఉదయనే సుప్రభాత సేవ, గంగ పూజ, పంచమృతాబిషేకం, పుష్పలంకరణ, నేవేధ్యం, మహా మంగళ హారతి పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంకాలం అరుగంటల సమయంలో ఆలయం వద్ద ప్రత్యేకంగా అలకరించిన ట్రాక్టర్ పై బసవేశ్వరున్ని ఉంచి వివిధ పుష్పలతో సర్వసుందరంగా అలంకరించారు. స్వామి వారిని ఆలయం నుండి ప్రధాన రహ దారుల్లో భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపు మేళా, తాలాలు డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని రాయదుర్గం ఎమ్మెల్యే, బెజెపి నాయకులు కాపు రామచంద్ర రెడ్డి పాల్గొన్ని స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీర శైవ జంగమ లింగత్ లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పట్టమ దేవర



విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన విడవన కల్లేశ్వర స్వామి లింగాల గుడి ఆవరణంలో ఆదివారం విడపనకల్లు స్వామి పట్టమ దేవర వైభవంగా జరిగింది. కురుబ సామాజిక వర్గానికి చెందిన భక్తులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బోతూల వంశము, అరీ కేలగోత్రము సోదరులు పట్టాభిషేకం నిర్వహించారు. విడపనకల్లేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గంగ జలాభిషేకం తీసుకుని ఊరేగింపు నిర్వహించారు. అరికెల గోత్రం వారు ఆంధ్ర ,కర్ణాటక రాష్ట్రాల నుండి వేలాదిమందితరలివచ్చి న భక్తుల నడుమ పట్టమ దేవ ర ఊరేగింపు సందడి వాతావరణం లో సాగింది. యువతులు కలశాలతో ముందు నడువగా ,డబ్బ వాయిద్యాల నడుమ స్వాముల ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు వైభవంగా సాగింది . దాది పొడవున బీరప్ప దేవుళ్ళను ప్రజలు దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి పెన్నాహొబిలం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరవకొండమండలం పెన్నాహొబిలం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం (నేడు) నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కొంగు బంగారంగా పెన్నహొబిలం లక్ష్మీనరసింహస్వామి విశేష పూజలు అందుకుంటున్నారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో స్వామి వారిని కొలిచే భక్తులు లక్షలాది మంది ఉన్నారు. ఇక్కడ పచ్చదనం జలపాతం చూపరులను ఆకట్టుకుంటుంది. పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధిగాంచి భక్తులకు ఆహ్లాదం మనశ్శాంతి, భక్తి భావాలను పంచుతోంది నేటి నుంచి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి 20వ తేదీ సోమవారం ఆమిద్యాల గ్రామం నుంచి శ్రీవారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెన్నాహొబిలంకు తీసుకొస్తారు.



స్వామివారికి నిర్వహించనున్న ఉత్సవాలు ఇవిగో..!

21న ధ్వజారోహణ 22 సింహ వాహనం, చంద్రప్రభ వాహనం, 23న గోవాహనం-శేష వాహనం, 24శ్రీ హంస వాహనం, 25 హనుమద్ వాహన ఉత్సవాలు నిర్వహిస్తారు. 26న గరుడు వాహనోత్సవం అనంతరం శ్రీవారి కల్యాణోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతోంది. 27న ఐరావత వాహనం, 28 ఉదయం మదుగు తేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం జరుగును 29న అశ్వవాహన ఉత్సవం 30న ధ్వజ అవరోహణం మరియు శయనోత్సవం 31న ఉత్సవ మూర్తులను ఆమిద్యాలకు చేర్చటంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

పాత రథానికి మరమ్మతులు

గతేడాది తేరుమరమ్మత్తుల సమయంలో రథం ధ్వంసమైంది. పాత రథం స్థానంలో కొత్తరతం తయారీకి పనులు జరుగుతున్న దృష్ట్యా ఈసారి బ్రహ్మోత్సవాలకు పాత రథాన్ని వినియోగించనున్నారు.

భక్తులకు ఏర్పాట్లు పూర్తి - విజయకుమార్ ఈవో

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్స వాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యా లను కూడా కల్పిస్తామని ఆలయ ఈవో కె.విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని భక్తులకు తాగు నీరు,భోజన వసతి కల్పించడంతో పాటు, మరుగుదొడ్లు, చలువ పందిళ్ళు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ -గ్రామ వలంటీర్ హత్య

▶ కారు స్వాధీనం..కేసునమోదు ▶ పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్‌సైదా

విశాలాంధ్ర-గోరంట్ల: మద్యం మత్తులో ఒకరినొకరు ఘర్షణకు దిగి వలం టీర్‌ను కొట్టి హత్య చేసిన సంఘటన మండలంలో ఆదివారం సంచలనం రేపింది. పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్‌సైదా తెలిపిన వివరాల మేరకు మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన కోడిపల్లి నరసింహులు కుమారుడు అనిల్‌కుమార్ యాదవ్ (24) గ్రామ వలంటీర్ గా పని చేస్తున్నాడు. అయితే మద్యానికి అలవాటు పడి, ఆదివారం మల్లాపల్లికి చెందిన నరసింహమూర్తి, నరేష్‌తో కలిసి కర్ణాటక ప్రాంతంలోని పెసలపర్తి గ్రామానికి మద్యం సేవించ డానికి వెళ్లారు.అయితే అక్కడ మద్యం సేవించి అనిల్‌కుమార్ యాదవ్ తన ద్విచక్ర వాహనం వాహనంలో ఇంటికి వస్తున్నాడు.మండలంలోని పులేరు పంచాయతీలోని కొత్తబయనపల్లి వద్దకు రాగానే కొత్తచెరువుకి చెందిన కారులో వచ్చిన వారితో మద్యం మత్తులో ఒకరినొకరు ద్విచక్ర వాహనం-కారు తో ఢీ కొట్టుకొని వాగ్వాదానికి దిగారు.ఘర్షణకు దారితీసింది.దీంతో కారులో వచ్చినవారు అనిల్‌కుమార్ యాదవ్‌ను బలంగా కొట్టడంతో అతను అక్కడి కక్కడే మృతి చెందారు.అయితే వెనుక మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న మల్లాపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి నరేష్ అనువారు సంఘటనను చూసి కేకలు వేయడంతో కారు వదిలి పారిపోతుండగా పట్టుకోవడానికి ప్రయత్నించడంతో ఒకరు దొరకగా పోలీసులకు అప్పగించారు,మరో ఐదు మంది అక్కడి నుండి పరారైనట్లు తెలిపారు.ఈ సంఘటనపై సీఐ సుబ్బరాయుడు తన సిబ్బందితో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు జరిపి నిందితులను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.మృతుడి తండ్రి కోడిపల్లి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.ఈ సంఘటనపై అన్ని కోణాలలో దర్యాప్తు జరిపి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అప్పటికే మద్యం సేవించి అనిల్ కుమార్‌ను హత్య చేసిన ఆరుగురు నిందితులపై పాత కేసులున్నాయని నేరచరిత్ర కలిగిన వారిగా గుర్తించమన్నారు. మృతుడు అనిల్ కుమార్ యాదవ్‌ను హత్య చేసి చంపడంతో మృతుని తల్లిదండ్రులు బంధువులు రోదించారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుని కుటుంబ సభ్యులు డీఎస్పీ,సీఐలను కోరారు.హత్య జరిగిన సంఘటన స్థలానికి డీఎస్పీ బాజీ జాన్‌సైదా చేరుకొని పరిశీలించారు.

రాష్ట్రస్థాయి యోగాసన జడ్జ్ శిక్షణా శిబిరం ముగింపు

విశాలాంధ్ర-అనంతపురం : వేమన టెలిఫోన్ భవన్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి శిక్షణా స్థాయి ముగింపు కార్యక్రమంలో జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె . శివశంకర్ మాట్లాడుతూ యోగాసనా న్యాయమూర్తి శిక్షణ పొందిన వారికి దిశనిర్దేశం చేశారు. పిల్లల్లో యోగ పట్ల అశక్తి కలిగించటం లో భాగంగా యోగాసనను ఒక క్రీడగా గుర్తించడం ఆనందించదగ్గ విషయమని తెలిపారు. ఈనెల 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు రాష్ట్రస్థాయి జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ అనంతపురం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు.రిటైర్డ్ జడ్జ్ కే శివ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు బి బాలగంగాధర్ రెడ్డి డిప్యూటీ జనరల్ మేనేజర్ బిఎస్ఎన్ఎల్ . పి. గురు ప్రసాద్ అడ్వకేట్, అనంతపూర్ క్లబ్ కార్యదర్శి పి.కేశవ రెడ్డి మరియు యోగ గురువును దివాకరు మారుతి ప్రసాదు, తారక రామయ్య, దాదులురయ్య,తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షరాలు శ్రీమతి రాధిక, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి కరిబండి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలు రమణ, రీసోర్సెస్ పర్సన్‌లు శ్రీధర్ రెడ్డి, నిర్మల రెడ్డి, అనిల్ మరియూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన ట్రైనీ జడ్జ్ లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన షాది మహల్

విశాలాంధ్ర-పుట్టపర్తి : ముస్లిం మైనార్టీల కోసం గత ఐదేళ్ల క్రితం నిర్మించిన షాదీ మహల్ భవనం నిరుపయోగంగా మారింది. అబ్దుల్ కలాం షాదీ మహల్ అనే పేరు కూడా పెట్టి బోర్డు తగిలించారు. గత ఆరేళ్ల క్రితం టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు మైనార్టీ నాయకులు వినతి పత్రం ద్వారా షాది మహల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన చంద్రబాబు కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో భవనాలు దాదాపుగా పూర్తి చేశారు. ఇక కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు అండర్ డ్రైనేజీ, బాత్ రూములు, టాయిలెట్ గదులు, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఇవి పూర్తి చేయడానికి మరో 20 లక్షలు అవసరం కాగా, అప్పటి ప్రభుత్వం దృష్టికి మైనార్టీ నాయకులు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో వైసిపి అధికారంలోకి రావడం జరిగింది. మైనార్టీ నాయకులు మిగిలిన పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి విన్నవించారు. అయితే ఐదేళ్లు అయిన నిధులు మంజూరు కాకపోవడంతో ఆ భవన సముదాయాలు నిరుద్యోగంగా పడి ఉన్నాయి. ముస్లింల వివాహా వేడుకలు, శుభకార్యాలు ఇతర సభలు సమావేశాలు నిర్వహించుకోవడానికి నిర్మించిన భవనాలు వినియోగంలోకి తీసుకురావాలని మైనార్టీ నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి ఎస్.మహమ్మద్ రఫీ - రాష్ట్ర మైనార్టీ నాయకులు

కోటి రూపాయలతో నిర్మించిన షాదీ మహల్ భవనాలు వినియోగంలోకి తీసుకురాకపోవడం విచారకరం, మరో 20 లక్షలు మంజూరు చేస్తే పూర్తి పనులు జరుగుతాయి. ముఖ్యమంత్రి జగన్ కు స్థానిక నాయకులకు విన్నవించడం జరిగింది. వచ్చే ప్రభుత్వం ఏదైనా షాది మహల్ ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నాను.

అల్లర్లు,గొడవలకు దూరంగా ఉండండి

విశాలాంధ్ర-యాడికి: ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు తహసీల్దార్ మోహనవల్లి, సీఐ నాగార్జున రెడ్డి, యాడికి మండలపరిధిలో సీ.ఆర్.పి.ఎఫ్, సిబ్బందితో కలిసి సమస్యాత్మకగ్రామాలైన కోనఉప్పలపాడు, రాయల చెరువు, గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ప్రజలతో సమావేశమై గ్రామాలలో ప్రశాంతత లోపించకుండా అందరూ సహక రించాలన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిదంగా కౌంటింగ్ రోజునాడు అల్లర్లు జరగకుండా సమన్వయంతో అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు.

హజ్ యాత్రకు వెళ్తున్న మీరాంభాషాకు సన్మానం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండకు చెందిన జిల్లా వక్స్ బోర్డ్ మెంబర్ జి ఎం ఎస్, మీరాం భాషా తన కుటుంబ సభ్యులతో కలిసి పవిత్రమైన హజ్ యాత్రకు వెళుతున్న సందర్భంగా ఆదివారం ఉరవకొండ మండల వైస్ ఎంపీపీ శ్రీనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, వైసీపీ నాయకులు బసవరాజు, ఓబన్న, శంకరయ్య వీరితో పాటు అనేకమంది మిత్రులు, బంధువులు జిల్లా వక్స్ బోర్డ్ మెంబర్ మీరం భాషా ను ఘనంగా సన్మానించారు. హజ్ యాత్రకు క్షేమంగా వెళ్లి రావాలని వారు ఆకాంక్షించారు.

ఇండ్లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పోలీసులు ఇండ్లపై దాడి చేసి పని మనుషులను కొట్టడం, ఇంటి ఫర్నిచర్ ను పగలగొట్టిన వారిపై కఠినంగా శిక్షించాలని వైసీపీ లీగల్ సెల్ సభ్యులు ఉమాపతి, సత్యనారాయణ రెడ్డి, ప్రభుకుమార్ మీడియా ముఖంగా ఆదివారము వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రిలో శనివారం నుండి ఆదివారం సిట్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, వైఎస్ఆర్సిపి లీగల్ సభ్యులమైన మేము సిట్ అధికారి శ్రీనివాసరావును కలసి పోలీసు అధికారులు దాడులు చేసిన వారిపై కేసులు బనాయించకుండా దాడులు చేయించుకున్న వారిపై కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఎన్నికల రోజే ఎస్పీ, ఏఎస్పి అల్లర్లు జరిగిన వెంటనే కఠిన చర్యలు తీసుకొంటే ఎన్నికల మరుసటి రోజు తాడిపత్రిలో ఇంతటి అరాచకం జరిగేది కాదన్నారు. కావున సిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విన్నవించా మన్నారు. ఈ విషయాన్ని హైకోర్టు వరకు తీసుకెళ్తామని చెప్పారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, మే 2024

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని ఏలుకుంట్లలో పంట కోసం అప్పులు చేసి ఆఅప్పును తీర్చలేక, సతమతమవుతూ, ఆర్థిక సమస్యలు ఎదిరించలేక ఆదివారం బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలకు వెళితే ఏరుకుంట్ల గ్రామానికి చెందిన యువరైతు గుట్టూరు బాలకృష్ణ (35) తనకున్న 5 ఎకరాల్లో మామిడి తోటను సాగు చేస్తున్నాడు, అదేవిధంగా అక్కడే వేరుశనగలు సాగు చేసి జీవనమును కొనసాగించేవాడు. అయితే గత కొన్నేళ్లుగా వర్షాలులేక ఉన్న రెండు బోర్లు కూడా నీరు ఇంకిపోవడంతో అప్పటినుంచి మనోవేదనకు గురయ్యాడు. తొలుత రెండు బోర్లు తదుపరి రెండు బోర్లు వేసినా కూడా అరకొరగా నీరు రావడంతో మామిడి తోట, వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయి నష్టపోయాడు. దాదాపు ఈ యువరైతు రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. అంతేకాకుండా డ్వాక్రా సంఘంలో రూ.50వేలు, బ్యాంకులో బంగారం నగలు తనకాపెట్టి మరో రూ.40 వేలు అప్పు తెచ్చుకొని పంటకు పెట్టుబడిగా పెట్టాడు. పంటలు పండక ఎన్నో బాధలను ఎదుర్కొంటూ వచ్చాడు. అనునిత్యం మనస్థాపనతో మధనపడుతూ అప్పులు బాధ తీర్చలేక ఇంటి సమీపంలో షెడ్డులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం జరిగింది. ఉదయం భార్య లేచి సరికి భర్త కనిపించక పోవడంతో పొలానికి వెళ్లి ఉంటాడని, అనుకున్న తరుణంలో ఇంటి పక్కనున్న షెడ్డులో భర్త ఉరేసుకున్న దృశ్యం భార్యను కుదిపివేసింది.దీంతో కుటుంబీకులు బోరున విలపించారు.

పంటల కోసం అన్ని అప్పులు చేసి చనిపోతే మేము ఎలా బతకాలి అంటూ పిల్లల్ని ఎలా బ్రతికించుకోవాలి అంటూ భార్య శ్రావణి రోధించిన వైనం అందరినీ కలిసివేసింది. తదుపరి రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవ పరీక్ష అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. మృతునికి భార్య శ్రావణి తో పాటు కుమారుడు పోతులయ్య, కుమార్తె ప్రణతి ఉన్నారు.

సబ్‌జైలు నిర్వహణపై జిల్లా న్యాయమూర్తి ఆగ్రహం-హెడ్‌వార్డెన్‌పై చర్యలకు సిఫార్సు

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం సబ్ జైలు నిర్వహణ తీరుపై ఆదివారం జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డులు, దస్త్రాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంపై జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్ పై అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా జడ్జితో పాటు స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సబ్ జైలును తనిఖీ చేశారు. తొలుత సబ్ జైలు లో ఉన్న ఖైదీల వివరాలను జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డు విషయంలో నిర్లక్ష్యంపై సంబంధిత హెడ్ వార్డర్ రామాంజినాయక్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జైలు గదులను, మరుగుదొడ్లను డీజే పరిశీలించారు. అదేవిధంగా ఖైదీలకు ఆహార పదార్థాలు వండేందుకు సరఫరా చేస్తున్న నిత్యావసరాలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. మంచినీటి సదుపాయం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలు గదుల్లో లైటింగ్, ఫ్యాన్ సదుపాయాలు ఉన్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలు ఒక్కొక్కరితో ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటినుండి జైలులో ఉంటున్నారు, న్యాయవాది ఉన్నారా, లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కాగా స్థానిక సబ్ జైల్లో పనిచేస్తున్న మరో హెడ్ వార్డర్ హరినాథ్ విధులకు మద్యం సేవించి వచ్చినా అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సూపరింటెండెంట్ అంజి నాయక్ ను ప్రశ్నించారు. దస్త్రాల నిర్వహణలో ఎందుకు అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, క్రమశిక్షణ వృత్తి పట్ల అంకితభావం లేకపోవడం వల్లే ఇలా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ కోర్టుల సూపరింటెండెంట్ లు భాస్కర్, రాధాకృష్ణ, రామాంజనేయులు, లోక్ అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ వేరుశనగలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

విశాలాంధ్ర-ఓబుల దేవర చెరువు : ఖరీఫ్లో వేరుశనగ సాగు చేసే రైతులు రైతు వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహమ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని, కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో పాటుగా మొబైల్ తీసుకెళ్లాలన్నారు. ఒక్కో పాసు పుస్తకానికి గరిష్టంగా మూడు బ్యాగులు మాత్రమే అందజేయడం జరుగుతుందన్నారు.కే-6, కదిరిలేపాక్షి రకంవిత్తనం మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం ఆర్బికే కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా జడ్జి

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ సబ్‌జైలును ఆదివారం అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి శ్రీనివాస్ పెనుకొండ స్పెషల్ సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులో బ్యారెకులు, టాయిలెట్లు, వంటగది, స్టోర్ రూమ్, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఖైదీలకు న్యాయ సహాయం చేస్తామని తగిన దరఖాస్తు చేసుకొని తమ దృష్టికితెస్తే పరిశీలన చేస్తామని ఆయన తెలిపారు. ఖైదీలు ఏ పరిస్థితులలో సబ్‌జైల్లో ఉన్నారని వారి కుటుంబ వివరాలు కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని సంవత్సరాల నుంచి సబ్‌జైల్లో ఉన్నారని సబ్‌జైలుకు రావడానికి కారణాలు పరిస్థితులపై ఆరా తీశారు.అనంతరం జిల్లా జడ్జికి సబ్‌జైలు పోలీసులు గౌరవ వందనం చేశారు. ఈకార్యక్రమంలో న్యాయ మూర్తులు అయిన బోజ్జప్ప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పెనుకొండ,ముజీబ్ పసపల సయ్యద్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అజ్గర్ హుస్సేన్, సబ్ జైల్ సూపరింటెండెంట్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ సంతకు వచ్చిన వివిధ గ్రామాల వాసులకు యాచకులకు బీదలకు ఆదివారం అయ్యప్ప స్వామి గుడి వద్ద నారాయణ సేవలో భాగంగా సుమారు 200 మందికి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమానికి మారుతి ప్రసాద్‌రెడ్డి,సరస్వతమ్మల వివాహ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా సహకరించి, సేవలో పాల్గొన్నారు. వీరితో పాటు మిత్రులు ప్రభాకర్‌రెడ్డి, జెసీబీ విజయ భాస్కర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సేవలో పాల్గొన్న వారందరికీ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అనుగ్రహ ఆశీస్సులు ఉండాలని సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.

విద్యార్థుల హాల్ టికెట్లను పంపిణీ చేయండి-డీఐఈవో

విశాలాంధ్ర-ధర్మవరం: జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలో ఐపిఏఏసిఈ-2024 తీరి పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల యొక్క హాల్ టికెట్లను వారి వారి కళాశాలలో బిఐ2 లాగిన్ లో ఉన్నవని, వాటిని డౌన్లోడ్ చేసుకుని విద్యార్థులందరికీ హాల్ టికెట్లను పంపిణీ చేయాలని జిల్లా డీఐఈవో రఘునాథరెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించాలని అందరు విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా కళాశాల ప్రిన్సిపల్స్‌కు వారు సర్క్యులర్ ద్వారా తెలియజేశారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుకొని మంచి ఫలితాలను సాధించాలని వారు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ధర్మవరం:మండల పరిధిలోని పోతుకుంట వైపు పోతుల నాగేపల్లి గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి పట్టణంలో పనిమీద తన ద్విచక్రవాహనానికి వచ్చి, తిరుగు ప్రయాణంలో మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. వెంకటరామిరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. చేనేతపల్లి మండలం వ్యాధిని గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి, బత్తలపల్లి మండలం అప్పరాచెరువుకు చెందిన విష్ణువర్ధన్ బాబు అను ఇద్దరు తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరం నుండి ద్విచక్ర వాహనంలో బయలుదేరి వారి గ్రామానికి తరలివస్తుండగా, బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విష్ణువర్ధన్ బాబుకు తీవ్ర గాయాలు కావడంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అశోక్ రెడ్డి బీటెక్ నాలుగో సంవత్సరం, విష్ణువర్ధన్‌బాబు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెట్రోల్ బంకుల్లో డీజిల్.. పెట్రోల్ దమ్ములు, సీసాల్లో పోయరాదు
ఆర్డీవో..రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి



విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం డివిజన్ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, చెన్నై, కొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలలో గల పెట్రోల్ బంక్ యజమానులు ఎన్నికల ఆదేశాల మేరకు ఏబంకులో కూడా డ్రమ్ములు, డబ్బాలు, సీసాలో పెట్రోల్ గాని డీజల్ గాని పోయకూడదని ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళికి అనుగుణంగా జూన్ 10వ తేదీ వరకు ఎన్నికల ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా డివిజన్ పరిధిలోని ఎమ్మార్వోలు తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, బృందాలగా నిరంతరం కొనసాగుతుందని, ఏఒక్క పెట్రోల్ బంక్ అయినా సరే నిబంధనలను ఉల్లంఘించినచో బంకు లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తామని వారు స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నియమావళిని ప్రస్తావిస్తూ తాజా చర్యలకు ఉపక్రమించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అన్ని పెట్రోల్ బంకులలో ఖాళీ సీసాలు, కానులకు, డబ్బాలకు పెట్రోల్ పోయాము అన్న పోస్టర్లు తప్పక అతికించాలని తెలిపారు. తప్పనిసరిగా అన్ని పెట్రోల్ బంక్ యజమానులు ఎన్నికల నియమాలని తప్పక అమలు చేసే బాధ్యత ఉందని తెలిపారు.

వలసబాటలో రైతన్నలు

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు తమ వ్యవసాయ బోర్లు గతంలో పుష్కలంగానీరు వస్తుండటంతో అనేక రకాల పంటలు, జెర్సీ, మేతను పండించి, పాడి ఆవులను మేపుకుంటూ అనేకమంది కూలీలకు పనులు కల్పిస్తూ జీవనోపాధి సాగించేవారమన్నారు. రెండేళ్లుగా వర్షాలు పడకపోవడంతో పుష్కలంగా నీరు వస్తున్న బోర్లు నీరు అడుగంటి పోవడంతో బోర్లలో నీరురాక ఏపంట వేసిన చేతికందడం లేదని అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులను సైతంరాక, జీవనోపాధి లేక అప్పులపాలై గ్రామాలు వదిలి పట్టణాలకు వలసలు వెళ్లవలసి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతుల వలసలను నివారించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కొత్తపేట గ్రామానికి చెందిన రైతులు వెంకటేష్, కిష్టప్ప, నరసింహారెడ్డి, మక్బూల్ బాషా, భీమే నాయక్, శాంతమ్మ, అనంతమ్మ, కుమారి, గిరి తదితర రైతులు కోరారు.

ఆర్బీకేల్లో రాయితీ విత్తనాలకు నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర-ఓబుల దేవర చెరువు రూరల్: మండలంలోని రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం సోమవారం నుంచి ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ భాషా తెలిపారు.ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ విత్తనాలు అందిస్తామని ఆయన తెలిపారు.ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వ సబ్సిడీ వేరుశన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో వేయడం నిషేధం

విశాలాంధ్ర-పుట్టపర్తి: పెట్రోల్ బంకులలో డీజిల్ పెట్రోల్ బాటిల్‌లకు నింపడం నిషేధమని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో విడుదలచేస్తూ జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఎన్నికలకమిషన్ నియమావళి ప్రకారం పెట్రోల్, డీజిల్‌లను బంకులలో విడివిడిగా బాటిళ్లలో ఇవ్వటం నిషేధమని అలా ఎవరైనా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల యజమానులకు సిబ్బందికి సూచనలు చేశారు. కొత్తచెరువు అప్ గ్రేడ్, సీఐ రాజా రమేష్, సిబ్బంది ద్వారా పెట్రోల్ బంక్ వద్ద ఫ్లెక్సీల రూపంలో నియమా వాళ్ళని ఏర్పాటు చేయించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని, ఎవరైనా ఎన్నికల కమిషన్ నియమా వాళ్ళని అతిక్రమిస్తే , పెట్రోల్ బంకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై ఇకనైనా చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానికంగా ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా యదేచ్ఛగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు జరుపుకోవడంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్యుఐ జిల్లా ఉపాధ్యక్షులు రావులచెరువు సురేష్ పేర్కొన్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా హోల్డింగ్స్ ద్వారా ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు నిర్వహించడం దారుణమన్నారు. స్థానిక విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరైనపద్ధతి కాదని, అలాంటి వారిపై తక్షణమే అధికారులు అడ్డుకోవాలని తెలిపారు.ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు సలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బండారు చైతన్య నాయకులు చందు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు అభినందన సభ

విశాలాంధ్ర-హిందూపురం: ఈ నెల 9న రాష్ట్రపతి చేతల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న హిందూపురానికి చెందిన ఎంకే. శ్రీధర్ ను నగరంలోని కంచి కామాక్షి కళ్యాణమండపంలో సంఘపరివార్ ఆధ్వర్యంలో ఆదివారంఘనంగా సన్మానించారు. వీహెచ్‌పీ రాఘవులు మాట్లాడుతూ శ్రీధర్ తనకున్న అంగవైకల్యాన్ని మనోబలంతో జయించి, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. ఏబీవీపీలో జాతీయ ఉపాధ్యక్షుడుగా కూడా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం బెంగళూరులో నెలకొల్పిన చాణక్య విశ్వవిద్యాలయానికి ఛాన్సిలర్‌గావ్యవహరిస్తున్నారన్నారు. ఆర్ఎస్ఎస్‌సంఘచాలక్ హిమకర్ మాట్లాడుతూ శ్రీధర్ ఇన్స్టిట్ బిల్డరన్నారు.శ్రీధర్ మిత్రులు రాధాకృష్ణ, డా. సుధాకర్, రమాదేవి, అశ్వత్థనారాయణ, స్థానిక సంఘ్ పరివార్ నాయకులు పీడీ పార్థసారథి, రమేష్‌రెడ్డి చారుకీర్తి, రామాంజినేయులు, రాంప్రసాద్, సుధా స్రవంతి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవ చేయడంలోనే సంతృప్తి -రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

విశాలాంధ్ర-ధర్మవరం: పేదలకు వైద్య సేవ చేయుటలోనే ఎంతో సంతృప్తి ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి. జయసింహ, కార్యదర్శి డి. నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా, క్యాంపు చైర్మన్ పి. కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు కే. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్బు, శంకరా కంటి ఆసుపత్రి-బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ-శ్రీ సత్యసాయి జిల్లా వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరమును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి 176 మంది కంటి రోగులకు గాను ఇందులో 126 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని, వీరిని 22వ తేదీ ఉచితంగా బెంగళూరు ఆసుపత్రికి తీసుకొని వెళ్లి ఆపరేషన్లు చేసి తిరిగి రావడం జరుగుతుందని తెలిపారు. తదుపరి ఈ శిబిరానికి దాతలుగా కీ.శే.బండిచిన్నపుల్లన్న, నారాయణమ్మ కుమారులు వెంకట నరసింహయ్య, హరినాథు, కీ.శే. పాలగిరి సుశీలమ్మల కుమారుడు శంకరనారాయణ, కీ.శే. పాలగిరి నాగలక్ష్మి ,భర్త నాగభూషణం వ్యవహరించడం పట్ల అభినందన శుభాకాంక్షలు తెలుపుతూ, కృతజ్ఞతలు తెలియజేశారు. రోటరీ క్లబ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు దాదాపుగా 30 వేలకు పైగా ఆపరేషన్లు చేయించి ఉచితంగా అద్దాలను కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.రోటరీక్లబ్ వివిధ రకాల సేవలను చేస్తూ పేద ప్రజల కు అండగా నిలుస్తోందని తెలిపారు. అంతేకాకుండా ప్రజలందరూ కూడా నేత్రదానంపై అవగాహన పొంది, అంధత్వాన్ని నివారించడానికి రెండు జీవితాలలో వెలుగు నింపడానికి నేత్రదానంకు కూడా పూనుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్ గుప్తా, మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి, క్లబ్బు అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవవాహనంలో దర్శనమిచ్చిన చెన్నకేశవ స్వామి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలు భాగంగా ఈవో వెంకటేశులు, ఉభయదాతలు, అర్చకులు, రథోత్సవ కమిటీ అధ్యక్షులు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు ద్వారా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగాఐదోరోజు ఆదివారం ఉదయం అర్చకులు కోనేరాచార్యులు,మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్ వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ స్వామివారికి తొలి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ఉదయం పల్లకి ఉత్సవ వాహనం, సాయంత్రం కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారు పల్లకి ఉత్సవ వాహనంలో ఆశీనులైన స్వామి వారిని రథోత్సవ కమిటీ, ఉభయదాతలు, భక్తాదులు రతాన్నిలాగి ప్రారంభించారు. పట్టణంలోని భక్తాదులకు ఆయా వాహనాల ద్వారా ఉదయం స్వామి దర్శనమిచ్చారు. ఉభయ దాతలుగా కీ.శే.చెన్నకేశవులు కుమారుడు ప్రసాద్, కీ.శే. సోలిగాల్ల బాలకృష్ణ జ్ఞాపకార్థం కుమారుడు వెంకటేశులు వ్యవహరించారు. ఉభయ దాతలుగా వ్యవహరించారు.సాయంత్రం జరిగిన కళ్యాణోత్సవానికి ఉభయ దాతలుగా గజనాన్య పట్టుసాలే సంఘం వారు వ్యవహరించారు. అనంతరం దాతల పేరిటన ప్రత్యేక పూజలు వనర్చి, తీర్థ ప్రసాదాలతో పాటు దాతలను ఘనంగా రథోత్సవ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం అర్చకులు, భక్తాదుల నడుమ సత్కరించారు. ఆలయ ప్రాంగణం సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఉభయ దాతల సహకారంతోనే బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాళ్ల పుల్లయ్య బృందం వారు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అందర్నీ ముగ్ధుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, హరి, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహ పునఃప్రతిష్ట పై విశేష పూజలు-అర్చకులు రాజేష్ ఆచార్యులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పట్టణంలోనే విశేషంగా గుర్తింపబడి భక్తాదుల, దాతల సహకారంతో దినదినాభివృద్ధి జరుగుతూ, స్వామి వారి ఆశీస్సులను పట్టణ ప్రజలకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పునఃప్రతిష్ట ఆదివారంతో 19 ఏళ్లు పూర్తి అయిన సందర్భంలో అర్చకులు స్వామివారికి విశేష పూజలతో పాటు పలురకాల అభిషేకములు, వేద మంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. స్వామివారిని వివిధ పూలమాలలతోనూ, తులసి మాలలతోనూ, వెండి కవచ ఆభరణలతోనూ అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నం శెట్టి జగదీష్, కార్యదర్శి జింక రాజేంద్రప్రసాద్, కోశాధికారి రమేష్ బాబు, సభ్యులు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా దాతలు, ఆలయ కమిటీ ద్వారా అభివృద్ధి చేయడం జరిగిందని, ఆలయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ సేవలను, ధన, వస్తు రూపేనా అందించిన అందరికీ వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మున్ముందు కూడా పట్టణ ప్రజల శ్రేయస్సు పై విశేష పూజలతో పాటు అందరూ ఆరోగ్యంగా ఉండేలా కార్యక్రమాలను కూడా చేపడుతామని తెలిపారు. ఈఆలయం భక్తాదులు దాతల యొక్క సహాయ సహకారములతో మున్ముందు మరింత అభివృద్ధి చెందు తోందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

కన్నుల పండువగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక బాహ్మణవీధిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ఆలయ ఈవో వెంకటేశులు, రథోత్సవ కమిటీ అధ్యక్షులు దాశెట్టి సుబ్రహ్మణ్యం, భక్తులు భక్తాదుల ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదవ రోజు ఆదివారం సాయంత్రం ఆలయంలో శ్రీదేవి భూదేవి ల శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి యొక్క కళ్యాణ ఉత్సవ వేడుకలు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాష్ చక్రధర్ నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవమనకి ఉభయ దాతలుగా గజనాన్ని పట్టు సాలే సంఘం వారు నిర్వహించడం పట్ల ఆలయ ఈవో రథోత్సవ కమిటీ వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ వారి పేరిటన విశేష పూజలు నిర్వహించి, వారిని ఘనంగా సత్కరించారు. తిరుమల తిరుపతి ప్రముఖ క్షేత్రాల సాంప్రదాయ పద్ధతిలోనే ఈ కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు విశ్వక్షేణపూజ, పుణ్యాహవాచనం, మూలవిరాట్ విగ్రహాలకు ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. మాంగల్య ధారణ తదితర కార్యక్రమాలను భక్తాదుల నడుమ నిర్వహించిన వైనం అందరిని విశేష భక్తి భావంతో నింపారు. ఉత్సవాలు ఈనెల 25తో ముగుస్తాయని వారు వెల్లడించారు.ఆలయ ఈవో వెంకటేశులు, రథోత్సవ కమిటీ దాశెట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరము మే నెలలో ఆలయ కమిటీ రథోత్సవ కమిటీ దాతలు భక్తాదుల సహాయ సహకారాలతో బ్రహ్మోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు.

ఘనంగా జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి.. సీపీఐ, సీపీఎం నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాయి కృప జూనియర్ కళాశాలలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు సీపీఐ, సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈకార్యక్రమం ఎస్హెచ్ భాష అధ్యక్షా జరిగింది. ముఖ్య అతిథులుగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ శేషు, ఆంధ్ర ప్రదేశ్ జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జే.వి రమణ ,సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, సిపిఎం పట్టణ కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, సీఐటీయూ జిల్లా నాయకులు, సీ పీఐ పట్టణ కార్యదర్శి రమణలు పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పుచ్చ లపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లాలో ఆలమ గారి పల్లి గ్రామంలో జన్మించాడని, విద్యార్థి దశ నుండి అనేక పోరాటాలకు ఆకర్షితులై, గ్రామీణ ప్రాంతాలలో దళిత గిరిజన వెనుకబడినటువంటి వర్గాలవిచక్షణకు రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అనేక పోరాటాలు చేసిన మహా నాయకుడని తెలిపారు. అదేవిధంగా వారు పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత సమావేశాలకు సైకిల్ మీద లేదా బస్సుల్లో వెళ్లి హాజరై సమస్యల పైన మాట్లాడిన తర్వాత వాటిని అధ్యయనం చేసి ఒక రిప్రజెంటెడ్‌ను, ఒక వినతి పత్రం రూపంలో తయారుచేసి, ప్రధానమంత్రి ఇంటికి వెళ్లి ఇచ్చేవారని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేసే వారిని తెలిపారు. తదుపరి వివాహం చేసుకున్న తర్వాత పిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించుకొని నిస్వార్థంగా పోరాటాలకు అంకితమయ్యారని తెలిపారు. వారి ఆశయ సాధనాలకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్‌యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతీ, చంద్రకళ, యూనియన్ నాయకులు పోతాక్క, ఫాతిమా, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షులు బాబు, కార్యదర్శి ముకుంద, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నకేశవులు, సలహాదారుడు ప్రసాద్, సూరి, వెంకటేశంలు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతికి నివాళులు

పెనుకొండ: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తొలి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుంద రయ్య 39 వ వర్ధంతి సందర్భంగా పెనుకొండ పట్టణంలో సిఐటియు కార్యాలయంలో కామ్రేడ్ సుందరయ్యకి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు గాంధీన సుందరయ్య తెలుగునాట ఉద్యమ నిర్మతంలో ప్రముఖుడు కుల వ్యవస్థను నిరసించిన ఆయన అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి తన పేరులోని రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నారు సహచరులు ఇతన ను పుచ్చలపల్లి సుందరయ్యఅనే పిలిచేవారు. ఆయన నిరాడంబరంతో ఆదర్శ జీవితం గడిపారు. స్వతంత్ర పోరాటం లోని అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. సుందరయ్య భార్య కూడా సీపీఎంలో ముఖ్య నాయకురాలుగా తెలంగాణ ప్రజా పోరాటం దాని పాఠాలు విశాలాంధ్రలోని,ప్రజారాజ్యం, వంటి పుస్తకాలు నివేదికలో రాశారు,పార్లమెంటు అసెంబ్లీ సభ్యునిగా సుదీర్ఘకాలం పని చేశారు.పార్లమెంట్లో కూడా సైకిల్ మీద వెళ్లేవారు. తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసి కృషి చేశారు.ఆయన ఆశయాలు స్ఫూర్తితో పోరాటాలు ఉద్యమాలు ఆయన బాటలో ప్రతి సభ్యుడు కూడా నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిప్పన్న, బాబావాలి, గంగాధర్, మాభాష తదితరులు పాల్గొన్నారు.